క్లుప్తంగా

విద్యార్థుల ప్రతిజ్ఞ

గన్నవరం: స్థానిక జిల్లా పరిషత్ బాలురోన్నత పాఠశాలలో మంగళవారం స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులతో మేరి మిట్టీ, మేరా దేష్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. సమావేశంలో ఎంఈఓ-2 ఆర్.కమల మాట్లాడుతూ విద్యార్థులకు సబ్జెక్టులు సులభతరంగా అర్థమయ్యే విధంగా బోధన పద్ధతులను పాటించాలని చెప్పారు. దీనికోసం ఉపాధ్యాయులు బోధన సామర్థ్యాలను మెరుగుపరుచుకోవాలని తెలిపారు. పాఠశాలలు అభివృద్ధి, విద్యా ప్రమాణాలను పెంపొందించే దిశగా పనిచేయాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎన్.రవీంద్రభవాని, స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని హెచ్‌ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

నున్న(విజయవాడరూరల్): పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతని నున్న గ్రామ పంచాయతీ కార్యదర్శి జీటీవీ రమణ అన్నారు. మంగళవారం నున్న గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి కుటుంబానికి చెత్త సేకరణ బుట్టలను ఉచితంగా వలంటీర్ల ద్వారా పంపిణీ చేస్తామన్నారు. సమావేశంలో సచివాలయ కార్యదర్శులు వరుణ్, అజేంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

4న హుండీ కానుకల లెక్కింపు

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయంలో హుండీ కానుకలను వచ్చే నెల 4వ తేదీన లెక్కిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి యువి.ప్రసాదరావు తెలిపారు. ఆయన మంగళవారం వివరాలు తెలుపుతూ.. 4వ తేదీ ఉదయం 10 గంటలకు అమ్మవారి ప్రాంగణంలో హుండీ కానుకల లెక్కింపు దేవదాయ, ధర్మదాయ అధికారుల సమక్షంలో జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన భక్తులు లెక్కింపులో పాల్గొనవచ్చని చెప్పారు. 5, 6 తేదీల్లో అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరల బహిరంగ వేలం నిర్వహిస్తామన్నారు.

వైఎస్సార్ కంటివెలుగు శిబిరంలో 89 మందికి పరీక్షలు

ఉయ్యూరు: కంటి సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించి వైద్యం చేయించుకోవాలని ఆప్తాలమిక్ ఆఫీసర్ వి.వి.రాజేష్‌కుమార్ సూచించారు. పట్టణంలోని ఏడో వార్డులో డాక్టర్ వైఎస్సార్ కంటివెలుగు శిబిరం మంగళవారం నిర్వహించారు. 60 ఏళ్ల నిండిన వృద్ధులు 89 మందికి కంటి వెలుగు శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందించారు. దృష్టి లోపాలు ఉన్న పలువురికి కళ్లజోళ్లకు సిఫార్సు చేశారు.

గ్రామాల్లో ఆరోగ్య సురక్ష సర్వే

గన్నవరం రూరల్: మండలంలోని గ్రామాల్లో మంగళవారం ఆరోగ్య సిబ్బంది జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే నిర్వహించారు. గ్రామాల్లోని ఇళ్లకు వెళ్లి కుటుంబ సభ్యులకు షుగర్, బీపీ వంటి 7 రకాల వైద్య పరీక్షలు నిర్వహించి నమోదు చేశారు. ప్రతి కుటుంబానికి అత్యుత్తమ వైద్యం అందించటమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ కార్యక్రమం నిర్వహిస్తుందని మండల వైద్యాధికారి డాక్టర్ ఆనంద్‌బాబు చెప్పారు. వలంటీర్లు, ఆశాలు పాల్గొన్నారు. సావరగూడెంలో పంచాయతీ కార్యదర్శి బెజవాడ చైతన్య సీహెచ్‌వో నిస్సీ ప్రీతమ్ సర్వేలో పాల్గొన్నారు.

ఈడుపుగల్లు పంచాయతీని సందర్శించిన కేంద్ర బృందం

కంకిపాడు: ఈడుపుగల్లు పంచాయతీ కార్యాలయాన్ని కేంద్ర ఆర్థిక శాఖ ప్రతినిధి బృందం మంగళవారం సందర్శించింది. ఆ శాఖ సహాయ కార్యదర్శి విజయ్‌కుమార్ నేతృత్వంలోని బృందం గ్రామ పంచాయతీని సందర్శించి 14, 15వ ఆర్థిక సంఘ నిధుల వినియోగానికి సంబంధించిన రికార్డులను పరిశీలించింది. సర్పంచ్‌లకు తెలీకుండా రాష్ట్ర ప్రభుత్వం నిధులను వెనక్కి తీసుకుందంటూ మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్ కేంద్ర ఆర్థికశాఖకు ఇచ్చిన వినతితో బృందం రికార్డులను పరిశీలించింది. పరిశీలనలోని అంశాలను ప్రభుత్వానికి నివేదిస్తామని విజయ్‌కుమార్ చెప్పారు. పరిశీలనలో జెడ్పీ సీఈఓ జ్యోతిబసు, డీపీఓ నాగేశ్వర నాయక్, డీఆర్‌డీఏ పీడీ ప్రసాద్, ఎంపీడీఓ టీ.ఉదయ భాస్కర్, సర్పంచ్ పి.ఇందిర, ఈఓ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

త్వరలో రైల్వే గేటు కష్టాలకు చెక్

- ఆర్‌ఓబీ నిర్మాణంతో తీరనున్న సమస్య
- స్థల సేకరణకు చర్యలు ప్రారంభం



మ్యాప్ పరిశీలిస్తున్న రైల్వే, రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ అధికారులు

ఉంగుటూరు: విజయవాడ-ఏలూరు రైల్వే మార్గంలో ఉంగుటూరు మండలం తేలప్రోలు-పెద అవుటపల్లి గ్రామాల్లో రైల్వే గేటు కష్టాలకు రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌ఓబీ)తో చెక్‌పడనుంది. ఇందుకు అవసరమైన చర్యలను మంగళవారం వివిధ విభాగాల అధికారులు ప్రారంభించారు. పెద అవుటపల్లి-తెంపల్లి, తేలప్రోలు-బందారు గూడెం ఆర్ అండ్‌బీ రహదారిలో వాహన చోదకులు, భారీ వాహనాలతో రద్దీగా ఉంటుంది. ఆ మార్గంలో రైలు బండ్లు రాకపోకలు ఎక్కువ. దీంతో ప్రతి 15 నుంచి 30 నిమిషాలకు ఒకసారి గేటు వేస్తారు. ఫలితంగా ప్రజలు, వాహన చోదకులు గేటు దాటి సమయానికి వెళ్లలేక ఇబ్బందులకు గురవుతున్నారు. 2015వ సంవత్సరంలో అప్పటి ప్రభుత్వం ఆర్‌వోబీ వేసేందుకు ప్రయత్నించినప్పటికీ ఆచరణలో విఫలమైంది. ప్రజల అవసరలా దృష్ట్యా ఈ ప్రాంతంలో ఆర్‌ఓబీ అవసరమని రైల్వే, ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా ఆయా గేటు మార్గాలను పరిశీలించారు. ఎక్కడైతే ఆర్‌ఓబీ నిర్మాణానికి అనువుగా ఉంటుందో ఆప్రాంతంలో ప్రణాళికలు రూపొందించారు. మ్యాప్‌ను పరిశీలించారు. ఆర్‌ఓబీ నిర్మాణానికి కావలసిన భూ సేకరణకు యుద్ధ ప్రాతిపాదికన చేపడుతున్నారు. దీనిలో భాగంగా రెవెన్యూ అధికారులు భూ సేకరణ చేసేందుకు కొలతలు ప్రారంభించారు. ఆర్‌ఓబీ వేస్తున్న విషయం తెలుసుకున్న ప్రజలు, వాహన చోదకులు గేటు కష్టాలు తీరనున్నాయని హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిశీలనలో రైల్వే డీఈఈ శ్రీనివాసరావు, ఆర్‌అండ్‌బి ఈఈ డి.బలరామ్, ఏఈ శ్రీహరి, ఉంగుటూరు, బాపులపాడు తహసీల్దార్లు డి.వనజాక్షి, సీహెచ్ నరసింహారావు, వీఆర్‌వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు.

రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలి

డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ కైలా శ్రీనివాసరావు

నున్న(విజయవాడరూరల్): డ్వాక్రా మహిళలకు ప్రభుత్వం అందజేస్తున్న వివిధ పథకాలకు సంబంధించిన రికార్డుల నిర్వహణలో ఎలాంటి లోపాలు ఉండకూడదని డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ కైలా శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం నున్న గ్రామంలో డ్వాక్రాగ్రూపుల మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీ 2023-24వ సంవత్సరానికి సంబంధించిన గ్రామైక్య సంఘాల రికార్డులను తనిఖీ చేశారు. కామన్ ఇన్వెస్ట్‌మెంటు ఎఫ్, స్త్రీనిధి, ఏపీఐఆర్‌జీపీ(ఆంధ్రప్రదేశ్ రూరల్ ఇన్‌క్లూసివ్ (గ్రోత్ ప్లాన్) కింద ప్రభుత్వం విడుదల చేసిన గ్రాంట్ల రికార్డులను పీడీ క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు చేరాల్సిన లబ్ధి కచ్చితంగా అందాలన్నారు. సమావేశంలో డీపీఎం శోభన్‌బాబు, స్త్రీ నిధి ఏజీఎం శోభ, ఏపీఎం జి.చంద్రశేఖర్, సీసీ కొండలరావు, రామారావు, వీఓఏలు పాల్గొన్నారు.

విద్యార్థులు సానుకూల దృక్పథం అలవర్చుకోవాలి



సెమినార్‌లో మాట్లాడుతున్న ప్రొఫెసర్ డాక్టర్ కోటేశ్వరరావు

ఉయ్యూరు: జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకోవాలంటే విద్యార్థులు సానుకూల దృక్పథం అలవర్చుకోవాలని కృష్ణా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.కోటేశ్వరరావు అన్నారు. స్థానిక ఏజీఅండ్‌ఎస్‌జీ సిద్ధార్థ కళాశాలలో నైపుణ్యం, ఏకాగ్రత, ప్రణాళికపై మంగళవారం డిగ్రీ, పీజీ విద్యార్థులకు సెమినార్ నిర్వహించారు. ప్రొఫెసర్ కోటేశ్వరరావు మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే లక్ష్యాలను సాధించేందుకు స్పష్టమైన ప్రణాళిక ఏర్పరచుకోవాలన్నారు. ఏకాగ్రతతో సానుకూల దృక్పథంతో ఆలోచనా విధానంతో లక్ష్యాన్ని అధిగమించవచ్చునని చెప్పారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రణాళికామార్పులతో అద్భుత విజయాలను సాధించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీరామ్, ప్రత్యేక అధికారి సత్యనారాయణ, ఆంగ్ల శాఖ అధిపతి బుల్లిబాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీ పర్యవేక్షణలో శ్మశానవాటిక నిర్మాణం

పెనమలూరు: పెనమలూరు హిందూ శ్మశానవాటిక గ్రామ పంచాయతీ పర్యవేక్షణలో నిర్మాణం చేయాలని గుడివాడ డీఎల్‌పీఓ సంపత్‌కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. పెనమలూరు గ్రామ పంచాయతీ తీర్మానం లేకుండా శ్మశానవాటిక నిర్మాణం చేస్తున్నారని గ్రామానికి చెందిన ఎం.బద్రి నారాయణ ఫిర్యాదు చేశారు. దీనిపై డీఎల్‌పీఓ స్పందిస్తూ శ్మశానవాటిక అభివృద్ధి గ్రామ పంచాయతీ పర్యవేక్షణలో చేపట్టాలన్నారు. అలాగే అధికారులు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని ఆదేశించారు. శ్మశానవాటికలో అన్ని వసతులు సమకూర్చాలన్నారు.

రూ.10 లక్షలతో ప్రహరీ నిర్మాణం..

పెనమలూరు హిందూ శ్మశానవాటిక ప్రహరీ రూ 10 లక్షలతో నిర్మాణం పూర్తి చేశామని గ్రామ సర్పంచి లింగాల భాస్కరరావు తెలిపారు. మండల పరిషత్ నిధులు రూ.7 లక్షలు, దాత కేఆర్‌కే ప్రసాద్ రూ.3 లక్షలు నిధులు ఇవ్వటంతో నిబంధనల ప్రకారం పని చేపట్టి పూర్తి చేశామన్నారు. పలువురు ఎంపీలు మంజూరు చేసిన నిధులతో మిగతా పనులు గ్రామ పంచాయతీ తీర్మానాల మేరకే చేపడతామని చెప్పారు.

చిత్రపటాలతో విద్యార్థుల ప్రదర్శన



స్వాతంత్ర్య సమరయోధుల చిత్రాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలోని జెడ్పీ హైస్కూల్‌లో ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా మంగళవారం 'నా భూమి-నా దేశం' కార్యక్రమం నిర్వహించారు. త్రివర్ణ పతాకం, జాతీయ నాయకుల చిత్రపటాలను పట్టుకుని విద్యార్థులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. స్వాతంత్ర్య సమరయోధులకు జోహార్లు అర్పిస్తూ నినాదాలు చేశారు. అనంతరం విద్యార్థులతో బాపులపాడు ఎంఈవో-2 బి.సురేష్ కుమార్ పంచ ప్రాణ ప్రతిజ్ఞ చేయించారు. విద్యార్థులు గీసిన దేశభక్తి, స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ప్రధానోపాధ్యాయురాలు పి.నిర్మల, ఉపాధ్యాయులు మానికొండ రమణగోపాల్ పాల్గొన్నారు.

స్వామి వివేకానంద జీవితం యువతకు ఆదర్శం

పెనమలూరు: స్వామి వివేకానంద జీవితాన్ని నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని విజయవాడ రామకృష్ణ మిషన్ కార్యదర్శి వినిష్పలనంద అన్నారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో మంగళవారం ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో వివేకానంద జీవితం-యువతకు ఆదర్శం అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన పాల్గొని ప్రసంగించారు. భారతదేశం గొప్పతనాన్ని ప్రపంచ పటంలో ఉంచిన స్వామివివేకానంద గురించి అందరూ తెలుసుకోవాలన్నారు. అమెరికాలోని చికాగో సభలో ప్రసంగించిన తరువాతే వివేకానందకు గుర్తింపు వచ్చిందన్నారు. ఆధ్యాత్మిక విషయాలతో పాటు దేశభక్తిని వివేకానంద పెంపొందించారని గుర్తుకు చేశారు. వివేకానంద సాహిత్యం ఇంగ్లిష్‌లో చదివితే ఇంగ్లిష్‌పై పట్టు పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఉంగుటూరు: మండలంలో ఇంటింటికీ రేషన్ పంపిణీ ఆపరేటర్ల దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంపీడీవో శేషగిరిరావు మంగళవారం తెలిపారు. పెద అవుటపల్లి, ఆత్కూరు, తేలప్రోలుల్లో ఎస్సీలు -3, ఎస్టీ-1 దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తికలవారు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్‌లతో మండల పరిషత్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

వంటలమ్మ మృతికి సంతాపం



నివాళులర్పిస్తున్న హెచ్‌ఎం దుర్గాభవాని

పెనమలూరు: పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గత 14 సంవత్సరాలుగా కుక్‌గా పని చేస్తున్న గుర్రం రమాదేవి(68) మంగళవారం ఉదయం మృతి చెందారు. ప్రతి రోజు 1,200 మంది విద్యార్థులకు రుచికరమైన ఆహారం వండి పెట్టి వంటలమ్మగా పేరు తెచ్చుకుంది. ఆమెకు గుండె నొప్పిరావటంతో ఆస్పత్రికి తరలించేలోపే తుది శ్వాస వదిలింది. ఆమె మరణ వార్త తెలుసుకున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. పాఠశాలలో హెచ్‌ఎం వై.దుర్గాభవాని, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘన నివాళులర్పించారు. అసెంబ్లీలో రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఆమె మృతదేహాన్ని సొంతూరు రావులపాలెంకు బంధువులు తీసుకువెళ్లారు.

అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తికి జైలుశిక్ష

గన్నవరం: వదిన పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన మరిదికి ఏడాది జైలుశిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ గన్నవరం 12వ ఏఎంఎం కోర్టు మంగళవారం తీర్పు ఇచ్చింది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలోని కేసరపల్లికి చెందిన కొల్లి ప్రసన్న పట్ల ఆమె మరిది శ్రీకాంత్ అసభ్యకరంగా ప్రవర్తించడంతో పాటు మానసికంగా, శారీరకంగా హింసిస్తున్నాడనే ఫిర్యాదుపై 2021 అక్టోబర్ 23న పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం దర్యాప్తు పూర్తిచేసిన గన్నవరం పోలీసులు 12వ ఏఎంఎం కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో విచారణ జరిపిన న్యాయస్థానం శ్రీకాంత్‌పై నేరం రుజువు కావడంతో జైలుశిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించింది. జరిమానా చెల్లించని పక్షంలో మరో మూడు నెలలు జైలు శిక్ష పొడగించాలని జడ్జి తీర్పులో పేర్కొన్నట్లు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వీ ప్రసన్న తెలిపారు.

అక్టోబర్ 1న యూటీఎఫ్ స్వర్ణోత్సవం

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఉపాధ్యాయ సమస్యలపై అలుపెరుగని పోరాటం చేస్తున్న యూటీఎఫ్ స్థాపించి 50 ఏళ్లు అవుతున్న తరుణంలో నిర్వహిస్తున్న స్వర్ణోత్సవాలను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి వెలమర్తి రవిబాబు కోరారు. స్థానిక విజయవాడ రోడ్డులోని సాయి గీతాంజలి హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) స్వర్ణోత్సవాల వాల్ పోస్టర్లను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. స్వర్ణోత్సవాలను పురస్కరించుకుని యూటీఎఫ్ నాయకులు శ్రీకాకుళం నుంచి ప్రారంభించిన బైక్ ర్యాలీ ఈ నెల 28వ తేదీన హనుమాన్‌జంక్షన్ చేరుకుంటుందని తెలిపారు. ఈ ర్యాలీకి మండలంలోని ఉపాధ్యాయులు హాజరై సంఘీభావం తెలపాలని కోరారు. వచ్చే నెల 1వ తేదీన విజయవాడలోని కానూరు సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ ప్రాంగణంలో ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ స్వర్ణోత్సవాలు ప్రారంభమవుతాయని చెప్పారు. యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ఎంఎస్‌ఆర్ ప్రసాద్, జనవిజ్ఞాన వేదిక మండల అధ్యక్ష, కార్యదర్శులు వీడీఎస్ ప్రసాద్, దారపురెడ్డి భాస్కరరావు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

నందిగామ: పట్టణంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో మిగిలి ఉన్న సీట్లకు స్పాట్ అడ్మిషన్లు అక్టోబర్ 3న నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్ బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఖాళీగా ఉన్న వివిధ కోర్సులకు సంబంధించిన సీట్లకు స్పాట్ అడ్మిషన్ నిర్వహించుకునేందుకు సాంకేతిక విద్యాశాఖ డైరెక్టర్ అనుమతి ఇచ్చారన్నారు. ఈ నేపథ్యంలో పట్టణంలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో మిగిలి ఉన్న ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ 11, కమర్షియల్ అండ్ కంప్యూటర్ ప్రాక్టీస్ 17 కోర్సులకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కోర్సులలో చేరాలనుకునేవారు పాలీసెట్ ఎంట్రన్స్ పరీక్ష రాయకపోయినప్పటికీ 10వ తరగతి ఉత్తీర్ణులై ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వివరాలకు కళాశాలలో సంప్రదించాలని కోరారు.

అన్నదానం

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో మంగళవారం విశేష పూజలు, అన్నదానం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో 200 మంది భక్తులకు అన్నదానం చేశారు. తిమ్మనవీడుకు చెందిన దాత బెజవాడ వెంకట నాగేంద్రం, వెంకటేశ్వరమ్మ దంపతుల ఆర్థిక సహకారంతో అన్నదానం చేశారు. దెందులూరు ఏఎంసీ చైర్మన్ అప్పన కనకదుర్గాప్రసాద్, ఆలయ పాలకమండలి చైర్మన్ నెరుసు భూషణం, ఈఓ కూచిపూడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న గణపతి మహోత్సవాలు



కేసరపల్లిలో శివలింగం ఆకారంలో అలంకరించిన దీపాలు

గన్నవరం: మండలంలోని పలు గ్రామాల్లో గణపతి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. కేసరపల్లిలోని శ్రీగంగా పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో ఉత్సవాల్లో భాగంగా మంగళవారం భక్తులు దీపోత్సవం నిర్వహించారు. ఓం, స్వస్తిక్, శివలింగం ఆకారాల్లో దీపాలను వెలిగించారు. తొలుత గణనాథుడికి పూజ కార్యక్రమాలు నిర్వహించారు. దావాజిగూడెంలోని శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయంలో విఘ్నేశ్వరుడికి పలు రకాల పుష్పాలతో అర్చనలు జరిపారు.

భక్తిశ్రద్ధలతో గణేష్ నవరాత్రులు

కంకిపాడు: గణేష్ నవరాత్రులు మండలంలో వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం వినాయక మండపాల్లో భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. కంకిపాడు పోలీసుస్టేషన్ రోడ్డులో భక్తులు భారీ అన్నసంతర్పణ ఏర్పాటుచేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని వినాయకుడికి పూజలు చేశారు.

ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లు సీజ్



సీజ్ చేసిన ఇసుక ట్రాక్టర్‌తో ఎస్‌ఈబీ అధికారులు

కంకిపాడు: ఇసుక అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు సీజ్ చేశారు. ఎస్‌ఈబీ ఉయ్యూరు ఎస్‌ఐ పి.లక్ష్మణరావు తెలిపిన వివరాల మేరకు.. ఎస్‌ఈబీ అదనపు సూపరింటెండెంట్ ఆర్.శ్రీహరి బాబు ఆదేశాల మేరకు అందిన సమాచారంతో గోసాల-మద్దూరురోడ్డు మార్గంలో ఎస్‌ఈబీ ఆధ్వర్యంలో మంగళవారం విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో భాగంగా రెండు ఇసుక ట్రాక్టర్లకు ఎలాంటి బిల్లులు లేకుండానే ఇసుక తరలిస్తున్నట్లు గుర్తించారు. దీంతో ఇసుకతో సహా రెండు ట్రాక్టర్లు, పది టన్నుల ఇసుకను స్వాధీనం చేసుకున్నారు. ఇసుక తరలింపునకు పాల్పడుతున్న మద్దూరు గ్రామస్తులు పోతాబత్తుల రామ్మోహన్‌రావు, పోతాబత్తుల శ్రీనివాసరావును అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు రెండు ట్రాక్టర్లను, నిందితులను కంకిపాడు పోలీసుస్టేషన్‌కు అప్పగించారు. తనిఖీల్లో ఎస్‌ఈబీ సిబ్బంది జి.నందికేశ్వరరావు, జి.కృష్ణారావు, పి.శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలు అవసరం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఏకాంబరం నాయుడు

రామవరప్పాడు : అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని నూతన ఆవిష్కరణల దిశగా విద్యార్థులు తమ ఆలోచనలను విస్తృతం చేయాలని ఎస్సార్కే ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఏకాంబరం నాయుడు అన్నారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని ఎస్సార్కే ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ఏఐటీసీ ఆధ్వర్యంలో 'స్మార్ట్ ఇండియా హ్యాక్ థాన్-2023' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సదస్సులో ఏకాంబరం నాయుడు మాట్లాడుతూ నూతన సాంకేతికతకు తగ్గట్టుగా విద్యార్థులు కొత్త ఆవిష్కరణలకు ఆలోచింపజేసే విధంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. పోటీ ప్రపంచానికి తగ్గట్టుగా తమ తమ రంగాల్లో వస్తున్న మార్పులు గమనిస్తూ సమాజానికి ఉపయోగపడేలా నూతన ఆవిష్కరణలు చేయాలన్నారు. పలు విభాగాలకు చెందిన విద్యార్థులు తమ తమ ఆలోచనలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రదర్శించారు. కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి ఆశాలత, వీ.శ్రీనివాస్, న్యాయ నిర్ణేతలు అనూష, శ్రీలక్ష్మి, ఈ.నాగరాజు అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థిని అదృశ్యంపై కేసు నమోదు

పెనమలూరు: తాడిగడప గ్రామంలో విద్యార్థిని అదృశ్యమైన ఘటనపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వి.శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం తాడిగడప శ్రీనివాసానగర్‌కాలువ కట్టపై కళింకోట నూకరత్నం, భర్త నూకరాజు, నలుగురు కుమార్తెలతో నివాసం ఉంటుంది. భర్త సెక్యూరిటీ గార్డుగా పని చేస్తుంటాడు. వారి చివరి కుమార్తె (17) విజయవాడలో ఇంటర్ ఫస్టియర్ చదువుతోంది. ఆమె ఈ నెల 25వ తేదీన కాలేజీకి బస్సులో వెళ్లింది. అయితే తిరిగి ఇంటికి రాలేదు. ఆమె కోసం కుటుంబ సభ్యులు వెతికినా ఆమె జాడ తెలియకపోవటంతో పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు

రామవరప్పాడు : గ్రామంలో సీజనల్ వ్యాధులు తలెత్తకుండా పారిశుద్ధ్యంపై ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఎనికేపాడు సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు తెలిపారు. ఎనికేపాడులో మంగళవారం ప్రధాన గ్రామంతో పాటు కాల్వగట్టు ప్రాంతాల్లో చెత్తను తొలగించి బ్లీచింగ్ చల్లించారు. సర్పంచ్ మాట్లాడుతూ సమస్యాత్మకంగా మారిన డ్రైయిన్లను గుర్తించి పూడిక తీత నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చెత్తను ఎప్పటికప్పుడు తొలగించి డంపింగ్ యార్డ్‌కు తరలిస్తున్నామన్నారు. శివాలయం పల్లాలు, కాల్వగట్టు ప్రాంతం, జెండా చెట్టు సెంటర్, ఎస్సీ కాలనీల్లో పారిశుద్ధ్య సిబ్బంది చెత్తను తొలగించారని వివరించారు. సురక్షిత తాగునీటి సరఫరాపై కూడా దృష్టి పెడుతున్నామని, గ్రామంలో రెండు వాటర్ ట్యాంకుల నిర్మాణ పనులు 80 శాతం పూర్తయ్యాయని, మరో రెండు ట్యాంకులు టెండర్ దశలో ఉన్నట్లు తెలిపారు.

ఉత్తమ ఫలితాల సాధనకై కృషి చేయాలి

హనుమాన్‌జంక్షన్ రూరల్: రాబోయే పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా కృషి చేయాలని సమగ్రశిక్ష జిల్లా సీఎంవో టి.రమేష్ సూచించారు. స్థానిక నూజివీడు రోడ్డులోని బాపులపాడు జెడ్పీ హైస్కూల్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. తొలుత పాఠశాలలో మనబడి నాడు-నేడు కార్యక్రమం కింద జరుగుతున్న పనులను ఆయన పరిశీలించారు. అనంతరం టెన్త్ విద్యార్థులతో మాట్లాడారు. పబ్లిక్ పరీక్షలకు క్రమశిక్షణ, సమయపాలన, ప్రణాళికతో ప్రిపేర్ అవ్వాలని సూచించారు. బాపులపాడు జెడ్పీ హైస్కూల్‌లో మూడో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు సుమారు 500 మంది విద్యార్థులు చదువుతున్నారని, పాఠశాలకు అదనపు తరగతి గదుల అవసరమని ప్రధానోపాధ్యాయుడు తోట వెంకట నాగేశ్వరరావు రమేష్‌కు విజ్ఞప్తి చేశారు. దీంతో ఆయన తక్షణమే ప్రతిపాదనలు పంపితే నిధులు మంజూరుకు సిఫార్సు చేస్తామన్నారు.